

తెలుగు జ్యోతి రచనలపోటీలో ద్వితీయ బహుమతి పొందిన
స్వానుభవ శీర్షిక పురస్కార ప్రదాతలు సిలికానాంధ్ర సంస్థ

# కథకోసం కారా మాస్టారు

*- వారణాసి నాగలక్ష్మి*

నా జీవితంలో మరచిపోలేని ఒక సంఘటన కిందటి సంవత్సరం జరిగింది.

రాయాలనే తపన చాలా తీవ్రంగా కలిగినపుడు ఓ కథో, పాటో రాయడం చిన్నప్పటి నుంచి నా అలవాటు. అలా రాసిన ఒక కథ 'ఆసరా'కి సిలికానాంధ్ర వారు 2006లో ప్రైజు ఇచ్చి ప్రోత్సహించారు. తెలుగు కథ మనగలగాలని, పురోగమించాలనే కోరికతో 'కథానిలయా'న్ని స్థాపించి తన సర్వశక్తులు దానిపైనే కేంద్రీకరిస్తున్న 'కారా మాష్టారు' శ్రీ కాళీపట్నం రామారావు గారు ఆ కథని చూడడం జరిగింది.

ఒక రోజు మధ్యాహ్నం మోగుతున్న ఫోను తీసి హలో అంటే అటువైపు నుంచి నా పేరు కాళీపట్నం రామారావు అంటారమ్మ నేను శ్రీకాకుళంలో వుంటాను అన్నారు. అంతకు ముందు రోజే వారి గురించి 'రచన' పత్రిక ఒక సంచిక అంతటా ఎన్నో వ్యాసాలూ కథలూ చదివి ఉండడంతో విభ్రాంతిగా నమస్కారం మాష్టారు అన్నాను.

అమ్మా! నీ కథ 'ఆసరా' చదివాను. చాలా బాగా రాశావు తల్లీ! అని అభినందించి నా వివరాలన్నీ శ్రద్ధగా కనుక్కున్నారు. ఎన్ని కథలు రాశావు? ఏవైనా కథల సంపుటి వచ్చిందా? ఎంత ఖర్చు పెట్టావు? కొంతైనా తిరిగి వచ్చిందా? వగైరా ప్రశ్నలడిగి తను ఎలా రాసేవారో, తనకి పేరు తెచ్చిన మొదటి కథ యజ్ఞం ఏ వయసులో రాశారో మొదలైన తన వివరాలన్నీ చెపుతూ కొంతసేపు వాత్సల్యంగా మాట్లాడి పెట్టేశారు.

మర్నాడు పొద్దున్నే నేను వంట ఇంట్లో పనిలో వుండగా మళ్ళీ ఫోన్ చేశారు. అమ్మా! నీ కథ నన్ను వెంటాడుతోందమ్మా! నీతో కొంతసేపు ప్రత్యక్షంగా మాట్లాడాలని వుంది. ఎప్పుడు వీలవుతుందో చూడాలి. నాకు ఎనభయ్యారేళ్ళు తల్లి! సులువుగా ఎక్కడికంటే అక్కడికి వెళ్ళలేను. ఈసారి హైదరాబాదు వచ్చినపుడు నిన్ను చూడడానికి ప్రయత్నిస్తాను!' అన్నారు. చివరికి 'అమ్మా! ఒక రచయిత బాగా రాయాలంటే ఎన్నో ఒత్తిళ్ళు ఎదుర్కోవలసి వస్తుంది. అప్పుడు అయినవాళ్ళ సహకారం ఉండాలి. మీవారు ఏం చేస్తారు? ఆయనకి ఖాళీ వున్నపుడు ఒకసారి నేను మాట్లాడాలను కుంటున్నాను' అన్నారు.

ఆరోజంతా మాస్టారి ఫోను కాల్‌నే తలుచుకున్నాను. కేవలం ఒక కథ నచ్చి, ఆ కథ రాసిన వ్యక్తిని చూసి మాట్లాడడం కోసం ఇంత వయోవృద్ధులు సంకల్పించడమేమిటా అని ఆనందంతో పాటు ఆశ్చర్యం కూడా కలిగింది.

సాయంత్రం నా భర్త ఇంటికి వచ్చాక వారిని మాస్టారికి ఫోన్ చేయమని అడిగాను. పరస్పర పరిచయాలయ్యాక మాస్టారు, రచయిత జీవితంలో ఎలాంటి ఒడిదుడుకులు వచ్చే అవకాశం వుందో చెప్పి, ఎలాంటి సహకారం తన నుంచి వస్తే రచయిత్రిగా నాకు తోడ్పాటు అందుతుందో వివరంగా చెప్పారు! ఒక తండ్రిలాగా ఆయన మొదటి పరిచయంలోనే అంత శ్రద్ధ తీసుకుని కూతురి గురించి అల్లుడితో చెప్పినట్టు మాట్లాడడం నాకెంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. తెలుగు కథా ప్రక్రియని బతికించాలని ఆయనకున్న తాపత్రయం వారి మాటల్లో బయటపడి మాస్టారు దీన్నొక ఉద్యమంలా తీసుకున్నారని అర్థమయింది!



Telugu Jyothi Special Issue April 08

తరువాత కొన్ని రోజులకి మాస్టారి నుంచి మళ్ళీ ఫోన్ వచ్చింది. ఆయన హైదరాబాద్ వచ్చారని, కుకట్‌పల్లిలో వున్నారని చెప్పి, నిన్ను చూడడానికి వస్తున్నానమ్మా! ఇంట్లో వున్నావా?' అని అడిగారు.. వుంటానని చెప్పాక, ఇంటి అడ్రస్ అడిగారు. మా ఇంటి గుర్తులు చెప్పి, వెతుక్కోవడం ఆయనకి కష్టమవుతుందని కాలనీలోకి రాగానే ఫోన్ చేస్తే నేను అక్కడకొచ్చి తీసుకొస్తానని చెప్పాను. ఆయన సరేనన్నారు. ఉత్సాహంగా ఎదురుచూస్తూ కూర్చున్నాను.

ఒక గంటసేపటికి ఆయన్నుంచి ఫోన్ వచ్చింది. కాలనీలో ఫలానాచోట వున్నానని. వెంటనే వెళ్ళాను. ఆయన్ని చూడగానే ఆయాసపడుతున్నట్టుగా కనిపించారు. ఒక ఫర్లాంగు దూరం కూడా తేలిగ్గా నడవలేరని నాకు అర్థమయ్యింది. మా ఇల్లు దగ్గరలోనే వున్నా, ఆటో పిలిచి వారిని ఇంటికి తీసుకువచ్చాను.

లోపలికి రాగానే, వారిని కూర్చోమని 'మాస్టారూ! మీరేం తీసుకుంటారు? కాఫీనా? మజ్జిగా?' అనడిగాను.

"ఏమీ వద్దమ్మా. నేను నీతోమాట్లాడాలని ఇంత దూరం వచ్చాను. నాకేమీ వద్దు. ఎక్కువ సమయం లేదు. నువ్వు వచ్చి కూర్చుంటే కొంతసేపు మాట్లాడి వెళ్ళిపోతాను'' అన్నారు.

అప్పటికే సిద్ధంగా ట్రేలో ఉన్న మంచినీళ్ళు, మజ్జిగ తెచ్చి ఎదురుగా పెట్టి మాస్టారి సమక్షంలో కూర్చున్నాను.

తెలుగు కథ గురించి ఎన్నో విషయాలు మాట్లాడారు. ప్రముఖుల ప్రశంస సాధారణ రచయితని ఏ విధంగా ప్రభావితం చేస్తుందో చెప్పారు. 'మా అమ్మాయిని పరిచయం చేస్తే, మీ అమ్మాయి, 'పాడాలని వుంది ప్రోగ్రాంలో పాడిందని విన్నాను.' అని ఒక పాట పాడించుకుని విన్నారు. ఆ పాట నేను రాసిందేనని విని, నువ్వు పాటలు రాస్తావని, బొమ్మలు వేస్తావని విన్నాను. ఈ గదిలో నీ పెయింటింగ్స్ చూశాను. పాట మనసుని అలరిస్తుంది నిజమే. అలాగే చక్కని బొమ్మ హృదయాన్ని సంతోషపరుస్తుంది. అయితే ఈ రెండిటినీ మించినది కథ. ఎందుకంటే కథ మనసుని అలరించడమే కాక, సామాజిక ప్రయోజనాన్ని కూడా సాధిస్తుంది తల్లీ! అందుకే ఇంకా, ఇంకా మంచి కథలు తెలుగులో రావాలి. అవన్నీ సేకరించబడాలి. ఇతర భాషల్లోకి తర్జుమా కావాలి. ఇతర భాషల్లో మంచి ప్రవేశం ఉన్న తెలుగు వాళ్ళు చక్కని కథలని ఆయా భాషల్లోకి తర్జుమా చేయాలి.

నువ్వు కథల మీదే మనసుని కేంద్రీకరించమని నా సలహా! నువ్వు గొప్ప రచయిత్రివని అనను కాని గొప్ప రచయిత్రి కావడానికి కావలసిన లక్షణాలు నీలోవున్నాయి. శైలి వుంది, వేగం వుంది, సామాజిక స్పృహ వుంది, ఈ లక్షణాలు వున్నాయి కనక నువ్వు బాగా రాయాలి, రాసిలో కాదు వాసిలో! అలా అన్నానని నువ్వు ఏది రాసినా నాకు పంపి మాస్టారూ, నా కథ ఎలా వుందని అడగద్దు. నువ్వు రాసింది మంచి కథ అయితే అది నా దగ్గరకు తప్పకుండా వస్తుంది!' అన్నారు.

'అమ్మా! ఇంకో విషయం. తెలుగులో ఎన్నో కథలు వచ్చాయి. వాటిల్లో చాలా కొన్ని మాత్రమే పదిలపరచబడ్డాయి.' అంటూ కథానిలయం స్థాపన, పురోగతి, దానికి సహకరిస్తున్న వారి గురించి చెప్పి, పాత వారపత్రికలు ఏవైనా నాదగ్గర వుంటే తనకు చెప్పమని, అవి కథానిలయంలో లేనట్లయితే తను వాటిని తీసుకువెళ్ళే ఏర్పాటు చేసుకుంటానని చెప్పారు.



Telugu Jyothi Special Issue April 08

ఆయన చెప్పదలచుకున్నవన్నీ చెప్పేశాక చాలా ముఖ్యమైన ఫంక్షన్ ఒకటి వుందనీ, వెంటనే వెళ్ళాలని హడావుడిగా బయల్దేరారు. అంత దూరం నుంచి శ్రమకోర్చి వచ్చినా, మంచినీళ్ళు, మజ్జిగ తప్ప ఏమీ తీసుకోలేదు.

"ఒక మంచి కథ రాసి నన్ను ఇంత దూరం ప్రయాణం చేయించావు. ఈసారి గొప్ప కథ రాసి ఈ కారా మాస్టారి చేత అబ్బో అనిపించుకోవాలి. నన్ను మళ్ళీ ఇక్కడికి రప్పించాలి!'' అంటూ తిరుగుప్రయాణం అయ్యారు!

ఒక ధ్యేయం కోసం బ్రతికే కార్యశీలికి ఎనభయ్యారేళ్ళ వయసులో ఈ దూరం దూరంగా, ఈ ప్రయాణం శ్రమగా అనిపించలేదు కాబోలు! తెలుగు కథ సర్వాంగ సుందరంగా రూపొందాలని ఇలా కారామాస్టారు ఎంతమంది 'బడ్డింగ్ రైటర్స్'ని ప్రోత్సహిస్తూ అవిరళంగా కృషి చేస్తున్నారో!

కథ పట్ల కారా మాస్టారి ప్రేమ కథ ఇది. అందుకే దీన్ని 'తెలుగు జ్యోతి' పత్రికలో 'స్వానుభవం'. శీర్షికకు పంపుతున్నాను. తెలుగు కథాభిమానులందరికీ సర్వధారి ఉగాది శుభాకాంక్షలు!!


***వారణాసి నాగలక్ష్మి***

స్వస్థలం నూజివీడు (కృష్ణా జిల్లా). సెంట్రల్ యూనివర్సిటీ హైదరాబాదులో కెమిస్ట్రీలో ఎం.ఫిల్ చేసి కొంతకాలం లెక్చరర్‌గా పని చేసారు. ప్రస్తుతం తమ ఖాళీ సమయాన్ని పెయింటింగ్, సృజనాత్మక రచనలకు వినియోగిస్తున్నారు.


---

ప్రేయసి! లేచిరమ్ము చివురించిన మావుల క్రింద శీతల
చ్ఛాయలలోన యౌవన వసంత శుభోదయ మయ్యె నవ్వుచున్
చేయికి జేయి జేర్చి పెరచింతలన్ పెరపించురాగముల్
దీయుచు వాసనల్పరిమళించెడు చోటుల యందు బోవగన్!

**-అబ్బూరి**



Telugu Jyothi Special Issue April 08